## టీ నర్సాపురంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుక



టి నరసాపురం జనవరి 30 ప్రభాతవార్త : సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి యావత్ భారతజాతికి స్వేచ్ఛా,స్వాతంత్రం అందించిన మన జాతిపిత మహాత్మాగాంధీ అని టి నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అద్దంకి గిరి కుమార్ తెలిపారు. దూ ఆర్ డై అంటూ పిలుపునిచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహోన్నత మూర్తి గాంధీ అని తెలిపారు. ఈ దేశానికి కాదు ఈ ప్రపంచానికే ఒక ఆదర్శమూర్తి వారు అని తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం సంఘ సభ్యులతో ను మరియు గ్రామస్తులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం కోశాధికారి కొనకళ్ల శ్రీను, సంఘ మాజీ అధ్యక్షులు మాదంశెట్టి మల్లిఖార్జునరావు, జూలూరి గోపి మాజీ కార్యదర్శి అద్దంకి రవి,సభ్యులు మండశీ ఆదిత్య,కొనకళ్ల మోహన్ కుమార్, కొనకళ్ల కాశి, మాటూరి రవి, పమిడి పుల్లారావు, నల్లూరి శ్రీనివాస్, ఎం రమేష్ లతో పాటు మహాత్మాగాంధీ అభిమానులు శివయ్య, చిన్నం బుజ్జి లతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ఆధ్వర్యంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం.




చింతలపూడి..ప్రభాత వార్త : చింతలపూడి సచివాలయం 4 బట్టువారిగూడెం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని తహసిల్దార్ డి. ప్రమద్వర ఆధ్వర్యంలో జరిపారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.పౌర హక్కులు అనగా జాతి, లింగం, దేశం, మతం వంటి బేధాలు లేకుండా ప్రతి మనిషికి సంక్రమించే హక్కులు, స్వేచ్ఛలే పౌర హక్కులని ఆమె అన్నారు.ఇవి ప్రతి వ్యక్తి గౌరవంగా, స్వేచ్ఛగా జీవించడానికి అవసరమైన హక్కు, విద్యా, పని, ఆరోగ్య హక్కులు అని, హింస, బానిసత్వం, చిత్రహింసల నుండి రక్షణ, భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వం కలిగి ఉంటాయని ఆమె అన్నారు. ప్రభుత్వాలు వీటిని రక్షించాలని, వీటిని ఉల్లంఘించకూడదని ఆమె బోధించారు.అనంతరం తాహిసిల్దార్, డిప్యూటీ తాహిసిల్దార్ షేక్. షకీలున్నీస మరియు రెవిన్యూ సిబ్బందితో పాటు సచివాలయం 4 బట్టువారిగూడెం గ్రామ ప్రజలతో సహా పంక్తి విందుని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సెక్రెటరీ దార. వీరేంద్ర, దార.వెంకటేశ్వరరావు, దార.రామకృష్ణ, తాడేపల్లి. గాబ్రియేల్, సరిపల్లి. సుగుణరావు, కస్సే.నాగేశ్వరరావు మరియు గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్లలో కుష్టి వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం



కామవరపుకోట,జనవరి 30,ప్రభాత వార్త: సమాజంలో ప్రజలు కుష్టి వ్యాధి పట్ల అపోహలు విడనాడాలని,వారి పట్ల వివక్ష చూపొద్దని తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి తెలిపారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి పట్ల అవగాహన, కుష్టు రోగుల విషయంలో వివక్ష తొలగించే అంశంపై తాడిచర్లలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సారథి మాట్లాడారు. కుష్టు వ్యాధి పట్ల ప్రభుత్వం అమలు చేస్తున్న అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రజల్లో ఉన్న అపనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నారని.. ప్రజలు వారికి సహకరించాలని ఆయన కోరారు. ఆరోగ్య విస్తరణ అధికారి నల్లా అప్పారావు మాట్లాడుతూ కుష్టు వ్యాధికి చికిత్స ఉందని ..చర్మంపై ఎవరికి అయినా స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మంగరాజు, సిహెచ్ఓ యశోద, ఏఎన్ఎంలు రత్నకుమారి, జయశ్రీ, ఆశా వర్కర్లు లక్ష్మీ కుమారి , జయ మనీ, దేవి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాత్ముని పేరే లేకుండా చట్టాన్ని మార్చిన ఘనుడు మోడీ : జె ఎన్ వి గోపాలన్



భీమవరంటౌన్, జనవరి 30 ప్రభాతవార్త : నాడు నాధూరామ్ గాడ్సే మహాత్ముడిని హత్య చేస్తే నేడు మహాత్ముని పేరే లేకుండా చట్టాన్ని మార్చిన ఘనుడు మోడీ అని సిపిఎం జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలన్ విమర్శించారు. గాంధీ వర్ధంతిని పురస్క రించుకొని స్థానిక మున్సిపల్ కార్యాల యంలోని గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ( పేదలకు ఉపాధి గ్యారెంటీ లేకుండా చేసే వి బి జి రామ్ జీ చట్టం రద్దు చేయాలని .పాత చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని గాంధీ విగ్రహాల వద్ద ప్రతిజ్ఞ చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా ) గాంధీ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ ప్రతిజ్ఞ పత్రాన్ని చదువుతూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు బి వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లా డుతూ ఉ పాధి గ్యారెంటీ చూపిస్తూ 125 రోజులు పెంచామని చెప్పి .మరోపక్క వ్యవసాయ సీజన్ లో 60 రోజులు నిషేధం విధించిన విషయం చెప్పక పోవడం కూలీలను మోసగించడమే అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉ పాధి హామీ విషయంలో కూలీలకు నష్టం కలిగించే విధానాలు అనుసరిస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ, కె క్రాంతి బాబు,ఇంజేటి శ్రీనివాస్, జుత్తుగ నరసింహమూర్తి,కె రాజా రామ్మోహన్ రాయ్ఎం, వైకుంఠ రావు,ఎం ఆంజనేయులు, ఎస్ కె వలి, వడుగు వెంకటేశ్వరరావు, చెల్ల బోయిన వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ. వేంద్ర సత్యనారాయణ, పోతుల మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

## గండిగూడెం బస్సు పునరుద్ధరణ పట్ల గ్రామస్తుల హర్షం



టీ నర్సాపురం జనవరి 30 ప్రభాతవార్త : ఏలూరు టు చింతలపూడి వయా గండిగూడెం బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇటీవల మండల కేంద్రం డి నరసాపురంలో జరిగిన జనవాణి లో పోలవరం గౌరవ శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బస్సు సర్వీసు పునరుద్ధరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పెద్ద కొరివి శేషారావు ఆధ్వర్యంలో బస్సు డ్రైవర్ కండక్టర్ లకు మిఠాయిలు తినిపించి తమ సంతోషాన్ని పంచుకున్నారు .ఈ సందర్భంగా కొరివి శేషారావు మాట్లాడుతూ ఎంతో శ్రద్ధతో బస్సు పునరుద్ధరణ పట్ల పెద్ద చీపిన ఎమ్మెల్యే బాలరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మరికొంత చొరవ చూపి తమ గ్రామ ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలని కరెంటు స్తంభాలు ఎత్తు పెంచాలని అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడి పాఠశాల భవనం పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో0 గ్రామస్తులుపింగుల మధు తలకొండ నాగబాబు, పాకనాటి శ్రీరాములు, పాకనాటి గంగరాజు, పాకనాటి దుర్గారావు పి రామారావు, కొరివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం



పెనుమంట్ర, జనవరి-30, ప్రభాతవార్త:మండలంలోని మార్టేరులో మానవత ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మానవత మండల ప్రెసిడెంట్ శిరం విశ్వనాథం మాట్లాడుతూ మాతృభూమి కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం అన్నారు. జిల్లా ప్రతినిధి కొత్త సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గాంధీ అహింసే ఆయన మార్గం, దేశంలో గౌతమ బుద్ధుడు తర్వాత బాపూజీ చూపిన సత్యం, అహింస మార్గాలు భావితరాలకు బంగారుబాట వేశాయన్నారు. "ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన బాపూజీ తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి భారత దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనే ఒక అరుదైన స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అమృత వాక్కుల సత్యనారాయణ, రీజనల్ శ్రీనివాసరావు, పడాల జగన్నాథ రెడ్డి, కర్రి కృష్ణ రెడ్డి ,బ్రహ్మేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామికి వెండి కవచం తో అలంకరణ,



పెనుమంట్ర, జనవరి-30, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు జెడ్ వంతెన దగ్గర శ్రీ అభయాంజనేయ స్వామి వారిని ఫిబ్రవరి-01వ తేదీన వెండి కవచముతో, గణపతిని వెండి కిరీటం తో అలంకరించిబడునని హనుమాన్ యువజన సేవా సంఘం సభ్యులైన కర్రి అచ్యుత రామారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయాంజనేయ స్వామివారికి వెండి కవచమును దాతలు ఇచ్చారని,అలాగే గణపతికి వెండి కిరీటం తేతలి సోమిరెడ్డి కమల దంపతులు ఇచ్చారని తెలిపారు. ఆదివారం మాఘ శుద్ధ పౌర్ణమి రోజున పంచామృతాలు, పళ్ళ రసాలతో అభిషేకం, హోమాలు ప్రత్యేక పూజలు చేసి ఈ ప్రతిష్ట జరుగునని అన్నారు. అనంతరం భారీ అన్న ప్రసాద వితరణ జరుగును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని తెలిపారు.

# కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలు

- పట్టణ ప్రాంతాల్లో మరింత జోష్
- 10 నుండి 25% పెంపుదలకు నిర్ణయం
- స్టాంపు డ్యూటీలో మార్పు లేదు




నరసాపురం జనవరి 29 ప్రభాత వార్త: ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి మార్కెట్ వేల్యూలు పెరుగుతున్నందున సబ్ రిజిస్టర్ కార్యాలయాలు గత నాలుగు రోజులుగా కిటకిటలాడుతున్నాయి .వారం వద్యంతో పని లేకుండా రోజు సగటున ప్రతి కార్యాలయంలో 50 నుండి 100 మున్సిపల్ కార్యాలయాలు పాలకొల్లు భీమవరం తాడేపల్లిగూడెం తణుకు ఏలూరు వంటి ప్రాంతాలలో 100కు పైగాను రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

ప్రభుత్వం ఫిబ్రవరి 1తేదీ నుండి కొన్ని మున్సిపాలిటీల్లో 10% మరికొన్ని మునిసిపాలిటీల్లో 25 నుండి 40% పెంచడానికి ఉ త్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ప్రతి కార్యాలయంలోనూ మార్కెట్ వేల్యూలు పెంచుతూ రికార్డులు సిద్ధం చేసి జాయింట్ కలెక్టర్కు సమర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. విలువల పెరిగిన తర్వాత విలువ ఆధారంగా స్టాంప్ డ్యూటీ ఫీజులు పెరుగుతాయి. అయితే స్టాంపు డ్యూటీ ప్రస్తుతం క్రయ దస్తావేజులపై 6.5% ఫీజులు ఒక శాతం వసూలు చేస్తున్నారు వీటిలో ఎటువంటి మార్పు చేయలేదు. కానీ భూమి విలువ స్థలం విలువ ఇంటి విలువ పెంచడం వల్ల ప్రస్తుతం వస్తున్న ఆదాయంపై ఆయా శాతాల ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు ఎకరం భూమి 20 లక్షలు ఉంటే అది 22 లక్షలు అయితే రెండు లక్షల పైన అదనంగా స్టాంప్ డ్యూటీ పడుతుందన్నమాట. అలాగే స్థలాలు ఇల్లు విలువలు కూడా పెరుగుతాయి .వాస్తవానికి ప్రభుత్వం ప్రతి ఏటా ఫిబ్రవరి మే నెలలో పెంచుతుంది గత సంవత్సరం కూడా పెరుగుదల జరిగింది. అయితే దాదాపుగా మార్కెట్ విలువలు పెంచిన పెంచకపోయినా గోదావరి జిల్లాలో మాత్రం క్రయవిక్రయాలు చాలాకాలంగా పడకేశాయి. మార్కెట్లో ఎక్కడా జోష్ లేదు విలువలు పెంచుతామని ప్రకటించిన చాలా కార్యాలయాలు ఉసురోమంటూనే ఉన్నాయి తప్ప అసలు పెరుగుదలలేదు. చాలా చోట్ల రద్దీ కూడా కనబడలేదు సాధారణ రిజిస్ట్రేషన్ కన్నా 20 30 అదనంగా అయ్యాయి. అయితే ఇవి రాబోయే రోజుల్లో మరింతగా గండి పడే అవకాశం లేకపోలేదు

వాస్తవానికి ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ పరిస్థితిలో విలువలు పెంచడం అనేది సరికాదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు ఇప్పటికే రియల్ ఎస్టేట్ అటకెక్కించడంతో రిజిస్ట్రేషన్ ఆదాయానికి గండి పడింది. ఎవరు కొనడం మానేశారు అలాగే భూములు కూడా బాగా తగ్గుముఖం పట్టాయి మూడు నాలుగు సంవత్సరాల క్రితం ఎకరం భూమి 60 లక్షలు పలికితే ఇప్పుడు 40 లక్షలు అన్నా కొనుగోలు చేసే దిక్కు లేదు అంతా చలో హైదరాబాద్ లేదా అడపా తడపా విశాఖ అంటున్నారు తప్ప సాధారణ పట్టణాల్లో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు .ప్లాట్లు వేసిన వారు ఇప్పటికే అప్పులు పాలై నానాపాట్లు పడుతున్నారు అయిన కాడికి ఇద్దామన్న కొనే నాథుడు లేడని వాపోతున్నారు. ఉ దాహరణకు ప్రభుత్వం అనధికార లేఔట్లకు సొమ్ము చెల్లించుకుని అధికార పత్రం ఇస్తామన్నా కనీసం 25% స్పందన రాలేదు అంతగా మార్కెట్ దిగజారింది. ఓవైపు ట్రంపు మరోవైపు ఆర్థిక సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్న బంగారం వెండి స్థిరాస్తిపై మోజులు తగ్గించాయని చెప్పాలి .ప్రధానంగా గోదావరి జిల్లాల ప్రజలు కొడుకో కూతురో భాగ్యనగరంలో స్థిరపడడంతో ఉన్న ఇల్లు స్థలం అమ్ముకునే అక్కడికే వెళ్లిపోతున్నారు ఈ దశలో ప్రభుత్వం విలువలు పెంచడం అనేది శుద్ధ అనాలోచిత చర్యని ఉన్నదాన్ని కూడా ఊడ గొట్టుకోవడమేనని విమర్శిస్తున్నారు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ అన్నట్లు పెరుగుదల తప్పదు. ఆనక ఈ ప్రభావం ఎలా ఉంటుందో చూడాలని ప్రతి కార్యాలయానికి ఇచ్చే టార్గెట్లు ఏమవుతాయోనని రిజిస్ట్రేషన్ అధికారులు బెంబేలు పడుతున్నారు.

## దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షునిగా రాజేంద్రప్రసాద్




నూజివీడు/చాట్రాయి, జనవరి 30, ప్రభాతవార్త : ఏలూరు జిల్లా బిజెపి దళిత మోర్చా ఉపాధ్యక్షునిగా నూజివీడు పట్టణానికి చెందిన తిరువీదుల రాజేంద్రప్రసాద్ మాస్టారు నియమితులయ్యారు.జిల్లా బిజెపి దళిత మోర్చా అధ్యక్షుడు బుర్రే శ్రీకర్ ఈ మేరకు నియామక ప్రకటన చేశారు.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేసిన రాజేంద్రప్రసాద్ పదవీ విరమణ అనంతరం బిజెపి లో చేరారు.ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వ ప్రతిత బడుగు బలహీన వర్గాలకు బిజెపి ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులైన పార్టీలో చేరినట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.తనపై నమ్మకంతో దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ,బూర్రె శ్రీకర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు, పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి మరియు నూజివీడు బిజెపి శ్రేణులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు.పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజేంద్రప్రసాద్ మాస్టారు తెలిపారు. రాజేంద్రప్రసాద్ నియామకం పట్ల బిజెపి నాయకులు,కార్యకర్తలు తమ హర్షం వ్యక్తం చేశారు.ఐ

## నియోజకవర్గ సమస్యలపై ప్రజా దర్బార్



నరసాపురం ప్రభాతవార్త జనవరి 30: నరసాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక శుక్రవారం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు హాజరై తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు, అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అనేక సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు.తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యలపై సంబంధిత పై అధికారులకు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించేలా స్పష్టమైన సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్



కైకలూరు,జనవరి, 30(ప్రభాతవార్త) : బంగారం దొంగిలించిన కేసులో నిందితుడిని కైకలూరు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు డి.ఎస్.పి శ్రావణ్ కుమార్ శుక్రవారం కైకలూరు పోలీస్ స్టేషన్ నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ లో గత ఏడాది సెప్టెంబర్ 19వ తేదీన జలగం శివ శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంటి దొంగతనం కేసు లో పాత నేరస్తుడైన కంచర్ల మోహన్ రావుని అరెస్టు చేశామని, అతని వద్ద నుండి 16 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ఈ కేసులో విచారణ చేపట్టిన పోలీసులకు పాత నేరస్తుడైన గుంటూరు జిల్లాకు చెందిన కంచర్ల మోహన్ రావు కైకలూరు రైల్వే స్టేషన్ రోడ్ లో పోలీసులకు చిక్కాడు. అతని వద్ద నుండి 16 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిపై 41 కేసులు ఉ ండగా వాటిలో 29 కేసుల్లో అతనికి శిక్ష పడింది. అతనిపై డిసి షీట్ తెరవనున్నామని డిఎస్పి చెప్పారు. అనంతరం డి.ఎస్.పి మాట్లాడుతూ ప్రజలందరూ ఊళ్ళకు వెళ్లే సమయంలో పోలీస్ ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను వినియోగించి తమ గృహాలకు పోలీసుల రక్షణను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కైకలూరు టౌన్ సిఐ ఏవీఎస్ రామకృష్ణ, టౌన్ ఎస్సై వెంకట్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## వరి పంటపై శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పరిశీలన,



పెనుమంట్ర, జనవరి 30, ప్రభాతవార్త: మండలంలోని ఆలమూరు గ్రామంలో మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం సారధ్యంలో వరి పంటపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు ప్రిన్సిపల్ సైంటిస్ట్, సాయిల్ డా.సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత రబీ వరి పంటలో చలి తీవ్రత వలన జింక్ దాతువు మొక్కలకు అందుబాటులో ఉండకపోవుట వలన పెరుగుదల పిలకలు చేయుట తక్కువగా ఉందన్నారు. ఎరువులు వేసినప్పటికి మొక్కలు ఎదగకుండా ఆకులపై తుప్పు మచ్చలు గమనించినట్లయితే జింకు లోపంగా గుర్తించి నివారణ చర్యలు సకాలంలో చేపట్టాలన్నారు. సార్వా మ దులు సరిగా కుళ్ళక పోవుట వలన జింక్ లోపము వస్తుందన్నారు. జింకు లోపము నివారణకు లీటర్ నీటికీ 2 గ్రా చొప్పున ఎకరానికి 400గ్రా జింక్ సల్ఫేట్ ను 200 లీటర్ల నీటిలో కలపి 5 రోజుల వ్యవదిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. రబీలో స్వల్ప కాలిక రకాలు కావున జంకు లోపము సకాలంలో సవరించు కోవాలన్నారు పిలకల దశలో చేను ఒకసారి ఆరబేడితే వేరు వ్యవస్థకు గాలి సోకి మొక్కకు పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఆనంద్ కుమార్, ఎంటమాలజీ, డా.వి శ్రీనివాసరావు, ఫిషరీస్, డా. వినయ లక్ష్మి, రైతులు గుర్రు పరమేశ్వరరావు, కర్రీ అయ్యప్ప రెడ్డి, తేతల వెంకట్రామారెడ్డి, కలిదిండి వెంకట్రామరాజు, కోట సుబ్బారావు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి ఉత్సవాలకు పటిష్ట భద్రత:ఎస్ఐ పి.చెన్నారావు



కామవరపుకోట,జనవరి 30,ప్రభాత వార్త: మండల కేంద్రమైన కామవరపుకోటలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తడికలపూడి సబ్ ఇన్స్పెక్టర్ పి.చెన్నారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవాల నిర్వహణ ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలు, తిరణాల ప్రాంగణం, స్టేజీ ప్రాంతాలను పరిశీలించారు.భక్తుల భద్రత కోసం 20 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం జరిగే గండ దీపాల కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సుమారు 40 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మరియు రథోత్సవం రోజు 70 మంది పోలీసులతో పాటు డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షణ చేపడతామని స్పష్టం చేశారు.భక్తులు తమ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రాత్రి జరిగే తిరణాల సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంప్ను సంప్రదించాలని సూచించారు.

### రహదారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం,
## ఎమ్మెల్యే చిర్రి




జీలుగుమిల్లి జనవరి 30, ప్రభాతవార్త: పోలవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని వంక వారి గూడెంలో వంక వారి గూడెం నుండి జీలుగుమిల్లి సబ్ స్టేషన్ వరకు రూ. 1.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు ఎమ్మెల్యే చిర్రి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. నూతనంగా నిర్మించనున్న ఈ రహదారిని రెండు నెలల్లో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.100.00 కోట్లు రహదారుల నిర్మాణానికి మంజూరు చేసామన్నారు . సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 27.00 కోట్లు మంజూరు చేసామన్నారు. మరో రూ. 15.00 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపమన్నారు.

దర్భగూడెంలో బోరుకు భూమి పూజ:-

మండలంలోని దర్భగూడెం గ్రామంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మండల పరిషత్ నిధులతో రూ.3.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న బోరు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో ఆ ముగ్గురు బాధితులకు రూ.33,400/-, చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు.

## ఘనంగా పల్లకి సేవ



అత్తిలి, జనవరి 30 (ప్రభాత వార్త): అత్తిలి మండలం గుమ్మంపాడు శ్రీహరి ప్రహ్లాద పురం లో గల సుబ్రహ్మణ్యేశ్వర గో మహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. వివిధ పుష్పాలతో అందంగా అలంకరించిన పల్లకిలో లక్ష్మీనరసింహస్వామి వారి ఉ త్సవమూర్తుల నుంచి మేళ తాళాలతో పల్లకీ సేవను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ, ప్రధాన నిర్వాహకుడు రవీంద్ర పణి గోపాల్,అర్చకుడు హరి గోపాల్, పూర్ణిమ, ములకపాటి విశ్వభారతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ జరిపారు.

## రావిపాడులో గాంధీ వర్ధంతి



.అత్తిలి /పెంటపాడు, జనవరి 30( ప్రభాత వార్త ):పెంటపాడు మండలం రావిపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ లో మహాత్మా గాంధీ 79వ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు కే.కాశీ విశ్వనాథం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.గాంధీ అంటే భరతమాత తలరాతను మార్చిన విధాత అని, తర తరాల భారతీయుల యాతనలను తీర్చిన మహాత్ముడు అని తెలిపారు. ఎస్ ఎంసీ చైర్మన్ కే డి ఎన్ రాజేశ్వరి, సభ్యులు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

### కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం.

అత్తిలి/ గణపవరం, జనవరి30(ప్రభాత వార్త): గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి ఓంకార్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయాలలో కుష్టు వ్యాధి వ్యతిరేకం గా ప్రతిజ్ఞ చేయించారు.

